సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



వ్యాధులపై అప్రమత్తం 8లో

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.



చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్

జిల్లాలోని అన్ని గ్రామాల్లో చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి లవరాజు తెలిపారు. 8లో



సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్:బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

మత్స్యగుండం జాతరకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

సాక్షి,పాడేరు: హుకుంపేట మండలం మత్స్యగుండంలో జరిగే శివరాత్రి జాతరకు పాడేరు డిపో నుంచి 30 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్టు ఆర్టీసీ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి టి.ఉమామహేశ్వరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈనెల 26,27తేదీల్లో రెండు రోజుల పాటు ఈ బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.పాడేరు,అరకులోయ, చింతపల్లి,జోలాపుట్టు ప్రాంతాల నుంచి ఈ సర్వీసులు నడుస్తాయని తెలిపారు. మత్స్యగుండం జాతరకు వచ్చే భక్తులు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, జెన్‌కో సీఈ వాసుదేవరావు

మోగుతూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామాలకు చెందిన 42 టీములతో నిర్వహిస్తున్న ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నమెంట్‌ను చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా, ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ స్థానిక యువత చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు.దూరం నుంచి వచ్చే క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు టోర్నీ నిర్వాహకుడు మోతుగూడెం గ్రామానికి చెందిన దూల్లూరి గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎస్ఈ(ఓ అండ్ ఎం) చిన్న కామేశ్వరరావు, డీఈలు బాలకృష్ణ, వరప్రసాద్, ఎస్ఐ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తరగతుల తరలింపును విరమించుకోవాలి



కోడెలిలో డీపీవో లవరాజుకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హుకుంపేట: తమ గ్రామ పాఠశాల నుంచి 3,4,5 తరగతుల తరలింపు నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కోడెలి గ్రామస్తులు శనివారం ఆందోళన చేశారు. జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) బి.లవరాజు గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా కోడెలి గ్రామస్తులు, వలంటీర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లు కొండబాబు నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న సాకుతో 3,4,5 తరగతులను వేరే పాఠశాలకు తరలించి, క్రమంగా గ్రామంలో పాఠశాలను మూసివేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోందని వారు ఆరోపించారు. తరగతుల తరలింపు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ డీపీవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తరగతులను తరలిస్తే సహించేది లేదని, కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. డీపీవో వెంట ఎంఈవోలు చెల్లయ్య,ఈశ్వరరావు,ఈవోపీఆర్డీ అప్పలరాజు తదితరులున్నారు.

అగ్గి అంటుకుంటే బుగ్గే

జిల్లాలో ఏటా వేసవిలో అగ్నిప్రమాదాలు అధికంగా సంభవిస్తూ అపార నష్టాన్ని మిగులుస్తున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, కాల్చిపడేసిన సిగరెట్, బీడీలు, గ్యాస్ సిలిండర్ పేలి ఇలా కారణం ఏదైనా వేసవి వచ్చిందంటే చాలు ఏదో చోట అగ్గి రాజుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో ప్రతి క్షణం అమూల్యమే. ఆలస్యమయ్యే కొద్దీ నష్టం పెరుగుతూ ఉంటుంది. అయితే జిల్లా మొత్తానికి కేవలం మూడు అగ్నిమాపక కేంద్రాలున్నాయి. రంపచోడవరం, కూనవరం పాడేరుల్లో మాత్రమే ఈ కేంద్రాలుండడంతో ఆ శకటాలు అంతదూరం ప్రయాణించి వెళ్లే సరికే భారీ నష్టం జరిగిపోతోంది.

- 22 మండలాలకు మూడే అగ్నిమాపక కేంద్రాలు
- సకాలంలో మంటలార్పక బూడిదవుతున్న ఆస్తులు
- మాచ్‌ఖండ్, సీలేరు పవర్ ప్రాజెక్టులకు పాడేరు నుంచే వాహనం వెళ్లాలి
- 100 నుంచి 140 కిలోమీటర్ల దూరం ప్రయాణం
- చింతపల్లి, అరకులోయలలో కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం





పాడేరులోని అగ్నిమాపక కేంద్రం

సాక్షి, పాడేరు: ప్రస్తుత వేసవిలో ఏ చిన్న అగ్ని ప్రమాదం సంభవించినా పెనుముప్పుగా మారే అవకాశం ఉంది. లక్షల రూపాయల ఆస్తులు, విలువైన ప్రాణాలు బుగ్గిపాలు కావాల్సిందే. ముదురుతున్న ఎండలతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే నివారించడం సవాల్‌గా మారుతుంది. పాడేరు, రంపచోడవరం, కూనవరం అగ్నిమాపక కేంద్రాలే పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 22 మండలాల్లో సేవలందిస్తున్నాయి. గత 20 ఏళ్లుగా అరకులోయ,చింతపల్లి మండలాల్లో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది.పాడేరు డివిజన్‌లోని 11మండలాలకు పాడేరులోని అగ్నిమాపక కేంద్రం ఒక్కటే ఆధారం. పాడేరు నుంచి అనంతగిరి, ముంచంగిపుట్టు, జీకే వీధి,కొయ్యూరు మండలాలు సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అగ్ని ప్రమాదాలు జరిగితే పాడేరు నుంచి ఆయా ప్రాంతాలకు అగ్నిమాపక శకటం సకాలంలో వెళ్లలేకపోవడంతో నష్టం విపరీతంగా జరుగుతోంది.

రెండు వాహనాల్లో ఒకటి మూలకు..

పాడేరు అగ్నిమాపక కేంద్రం సేవలను విస్తరించడంలో ఆశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత కూడా జిల్లాలో అగ్నిమాపక కేంద్రాల విస్తరణ లేకపోవడం దారుణమని అన్ని వర్గాల ప్రజలు వాపోతున్నారు. పాడేరులో అదనంగా మరో వాహనం ఏర్పాటు చేసినప్పటికీ అది మరమ్మతులతో మూలకు చేరింది.

పాడేరుకు 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీలేరు పవర్ ప్రాజెక్టులో, సుమారు 85 కిలోమీటర్ల దూరంలోని మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టులో అగ్నిప్రమాదాలు జరిగితే పాడేరు నుంచే అగ్నిమాపక వాహనం వెళ్లాలి. ఈ రెండు ప్రాజెక్టులకు వాహనం వెళ్లాలంటే కనీసం నాలుగు గంటల సమయం పడుతుంది. ఈ ప్రాజెక్టులలో అగ్ని ప్రమాదాలు జరిగితే పరిస్థితి దైవాదీనమే. నాలుగేళ్ల క్రితం మాచ్‌ఖండ్‌లో విద్యుత్ తయారీ జనరేటర్ విభాగంలో మంటలు వ్యాపించినప్పుడు వాటిని అదుపు చేసేందుకు అధికారులు అష్టకష్టాలు పడ్డారు.పాడేరు నుంచి అగ్నిమాపక శకటం వెళ్లేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దూర ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్న సమయంలో సకాలంలో వాహనం చేరుకోలేకపోతోంది. దీంతో ప్రజల, ప్రభుత్వ ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి.

ప్రతిపాదనలతో సరి..

అరకులోయ, చింతపల్లిలలో రెండు అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేస్తే అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, ముంచంగిపుట్టు, చింతపల్లి, జి.కె.వీధి, కొయ్యూరు మండలాల్లో ప్రమాదాలు జరిగితే సకాలంలో మంటలను అదుపు చేసి, ప్రజల ఆస్తులు, ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుంది. ఆ రెండు చోట్ల అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలున్నప్పటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

కష్టం కళ్లముందే బుగ్గిపాలు



మూడేళ్ల క్రితం ఖరీఫ్‌లో సాగు చేసిన వరిపంట మొత్తం కళ్లముందే దగ్ధమైంది.ఆరుగాలం కష్టం చూస్తుండగానే కాలిపోతున్నా ఏంచేయలేకపోయాం. పాడేరు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసినా ఫలితంలేకపోయింది.అరకులోయలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో ఈప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరిగితే తీవ్రంగా నష్టపోవలసి వస్తోంది. – సొనాయి బజ్జింగు, బోసుబెడ గ్రామం

పాడేరు నుంచి వాహనం రావడం కష్టమే



జీకే వీధి మండలంలోని సీలేరు.. పాడేరుకు 140 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే పాడేరు నుంచి వాహనం రావడానికి కనీసం ఐదు గంటల సమయం పడుతుంది. చింతపల్లిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

– ధనుంజయకుమార్, వ్యాపారి, సీలేరు

అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



జిల్లాలో అవసరమైన చోట్ల అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు చర్యలు తీసుకుంటాం. అరకులోయకు అగ్నిమాపక కేంద్రం మంజూరైంది.స్థల పరిశీలన జరుపుతున్నాం. చింతూరులోను అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉంది.

– లక్ష్మణ స్వామి,
జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి

కూనవరంలో నలుగురే...

కూనవరం: కూనవరం అగ్నిమాపక కేంద్రం పరిధిలో కూనవరంతో పాటు వీఆర్‌పురం, చింతూరు, ఎకటపాక మండలాలున్నాయి. ఈ కేంద్రంలో తొమ్మిది మంది సిబ్బందిగాను కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. ఔట్‌పోస్టు ఫైర్ స్టేషన్‌గా దీనిని ఏర్పాటు చేయడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రతి 15 రోజులకు నలుగురు చొప్పున డిప్యుటేషన్‌పై వచ్చి విధులు నిర్వహిస్తారు. శాశ్వత సిబ్బంది కాకపోవడంతో ఈ ప్రాంతంపై కొంత అవగాహన తక్కువగా ఉంటోంది. రంపచోడవరం అగ్నిమాపక కేంద్రంలో ఒక ఎస్ఎఫ్‌వో, లీడింగ్ ఫైర్ సిబ్బంది ముగ్గురు, డ్రైవర్ ఆపరేటర్లు ముగ్గురు, హోంగార్డులు ఇద్దరు ఉన్నారు. ఈకేంద్రం పరిధిలో రంపచోడవరం మండలంతో పాటు మారేడుమిల్లి, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, దేవీ పట్నం,గంగవరం మండలాలున్నాయి.

2020-25 సంవత్సరాల మధ్యలో జరిగిన అగ్నిప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	నష్టం వివరాలు రూ.లక్షలలో	రక్షించిన ఆస్తి విలువ రూ.లక్షలలో
కూనవరం ఔట్‌పోస్ట్ ఫైర్‌స్టేషన్			
2020-21	30	16,45,000	58,10,000
2021-22	27	17,30,000	34,70,000
2022-23	33	18,42,000	37,65,000
2023-24	28	28,73,500	35,17,500
2024-25	44	19,52,000	81,02,000
రంపచోడవరం			
2021-22	43	35,83,500	16,13,500
2022-23	25	16,35,000	27,10,000
2023-24	22	12,11,000	13,84,000
2024-25	21	8,43,000	26,12,000

రైతులు ఇబ్బందులు పడుతుంటే

విష ప్రచారమా ?

పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరాజు



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరాజు

పాడేరు: గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే, వారి సమస్యలు పరిష్కరించవలసిందిపోయి కూటమి ప్రభుత్వం విష ప్రచారం చేయడం దుర్మార్గమని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి రైతులు గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గుంటూరు మిర్చి యార్డులో రైతులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించిన తర్వాత కూటమి ప్రభుత్వ అనుకూల మీడియా దుష్ప్రచారం చేస్తోందని చెప్పారు. రాష్ట్ర మంత్రులు చేస్తున్న వాఖ్యలు, వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. రైతుల కష్టాలను కూడా వక్రీకరించి అబద్ధాలను పోగు చేసి తప్పుడు ప్రచారం చేయడం కూటమి నాయకులకే చెల్లిందని ఆయన ధ్వజమెత్తారు. జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మిర్చి యార్డుకు వెళ్తున్నారని తెలిసిఉద్దేశపూర్వకంగానే భద్రత సమస్యను సృష్టించి కుట్రకు తెరలేపారన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆయన మండి పడ్డారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి 2014లో గిరిజన ప్రాంత ప్రజల ఓట్లతో శాసన సభ్యురాలిగా గెలిచి, ఇప్పుడు గిరిజన చట్టాలకు తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. 1/70 చట్టానికి సవరణ చేయాలనే కుట్రకు 2018లోనే బీజం వేసిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కొయ్యూరు మండలం షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న భూములకు గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని కోరిన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. గిరిజన చట్టాలు, హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్న గిడ్డి ఈశ్వరి ఈ ప్రాంతంలో తిరిగే నైతిక హక్కు కోల్పోయారని చెప్పారు. గిరిజన చట్టాలు, హక్కులను తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్న కూటమి నాయకులను గిరిజనులు నిలదీయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్‌కుమార్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కె.ఊర్వశిరాణి, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు లకే రామసత్యవతి, టి.వెంకటేశ్వర్లు, సర్పంచ్ వంతాల బొంజుబాబు, ఎంపీటీసీ సభ్యురాలు సల్లా చిట్టమ్మ, పార్టీ సీనియర్ నాయకులు కూడా సుబ్రహ్మణ్యం, ఎం.సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భానుడే అమరె బల్బులా..



నిత్యం చూసిన ప్రకృతి ఎప్పుడూ కొత్తగానే కనిపిస్తుంది. సూర్యోదయ సమయంలో భానుడు విద్యుత్ బల్బులా అమరి బంగారు వర్ణాలతో కాంతులు వెదజల్లాడు. ముంచంగిపుట్టు మండలం జర్రెల పంచాయతీ దశరిపుట్టు గ్రామ సమీపంలో విద్యుత్ బల్బులా స్తంభంపై భానుడు ఇలా కనువిందు చేశాడు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– ముంచంగిపుట్టు

ఐదు పాఠశాలల్లో తనిఖీలు

కొయ్యూరు: మండలంలోని ఐదు పాఠశాలల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. విజయనగరం జిల్లాకు చెందిన ఉపాధిహామీ పథకం అధికారి కొయ్యూరు మండలంలో ప్రభుత్వోన్నత పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాల–1,కస్తూర్బాగాంధీ పాఠశాల, బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శరభన్నపాలెం పంచాయతీ శరమండ ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాజరు సరిచూశారు. వసతి గృహాలకు సంబంధించి నిల్వలను పరిశీలించారు.రికార్డుల్లో చూపిన దానికి భౌతికంగా ఉన్న నిల్వలను సరి చూశారు. కిలో బియ్యం ఎక్కువైతే ఆ బియ్యం ఎలా మిగిలాయని ప్రశ్నించడంతో ఉపాధ్యాయులు పూర్తి వివరణ ఇచ్చారు. మరో శాఖద్వారా ఇలాంటి తనిఖీలు నిర్వహించడం ఇదే మొదటి సారి కావడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై ఎంఈవో రాంబాబు మాట్లాడుతూ ఐదు పాఠశాలల్లో సామాజిక తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు.

క్లుప్తంగా

పోస్టల్ పొదుపు సేవలపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఐపీవో లక్ష్మీ కిషోర్

ముంచంగిపుట్టు: గ్రామాల్లో ప్రతి ఇంట్లో పోస్టల్ పొదుపు ఖాతాలు ఉండడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు అరకు డివిజన్ పోస్టల్ ఐపీవో వి.లక్ష్మీకిషోర్ అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ కేంద్రంతో పాటు గన్నెడ, పేటమాలిపుట్టు గ్రామాల్లో శనివారం పోస్టల్ సిబ్బంది పోస్టల్ పొదుపు ఖాతాలపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. పోస్టల్ సేవింగ్ ఖాతాలు, బీమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐపీవో లక్ష్మీకిషోర్ మాట్లాడుతూ నేటి సమాజంలో పొదుపు చేసుకోవడం ముఖ్యమని, పోస్టల్ శాఖలో అనేక రకాల పొదుపు ఖాతాలు, ప్రమాద బీమాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోస్టల్ ఖాతాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పలువురు గిరిజనులకు పోస్టల్ ఖాతాలను తెరిపించారు. ఈ కార్యక్రమంలో ఎంవో శ్రీను, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటన స్థలంలో పడి ఉన్న మృతదేహం

ఎటపాక: బండిరేవు వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై అప్పలరాజు తెలిపిన వివరాలు.. మల్కన్‌గిరి జిల్లా మోటు పంచాయతీ బినాయక్‌పూర్ గ్రామానికి చెందిన పండా బజారు (38) భద్రాచలంలో పెయింటింగ్ పనిచేస్తున్నాడు. స్వగ్రామం వెళ్లి తిరిగి తన ద్విచక్ర వాహనంపై శనివారం భద్రాచలం వస్తున్నాడు. ఎటపాక మండలం బండిరేవు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం మూలమలుపు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలయిన బజారు అక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధులపై అప్రమత్తం

ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర



కుజభంగిలో గిరిజనులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలో బంగారుమెట్ట పంచాయతీలోని పలు గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారితో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.స్థానిక సర్పంచ్ రత్న, ఎంపీటీసీ సభ్యురాలు కొండమ్మలతో మాట్లాడి సరియాపల్లిలో ఇటీవల అస్వస్థతకు గురైన గిరిజనుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి, చికిత్స పొందాలని తెలిపారు. ఏనుగురాయి పంచాయతీ రాత్తులపుట్టు గ్రామం వద్ద కల్వర్టు నిర్మించి, తారురోడ్డు నిర్మించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు నరసింగరావు,రమేష్,ఎంపీటీసీ సుబ్బలక్ష్మిలు చైర్‌పర్సన్‌కు తెలియజేయడంతో రాతులపుట్టు కల్వర్టును ఆమె పరిశీలించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు,వైఎస్సార్‌సీపీ రాష్ట్ర,జిల్లా నేతలు జగబంధు, కొండలరావు,మూర్తి,అప్పరావు,మోహన్,జగన్నాథం, సన్యాసిరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు పుట్టినిల్లు విశాఖ

- విశాఖ న్యాయవాదుల సంఘానికి ఉజ్వల భవిష్యత్
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్

విశాఖ లీగల్: వందేళ్ల పండగకు సిద్ధమవుతున్న విశాఖ న్యాయవాదుల సంఘానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకటనారాయణ భట్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో విశాఖ న్యాయవాద సంఘాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ శరవేగంతో విస్తరిస్తున్న విశాఖ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. విశాఖ న్యాయవాదులకు అంతర్జాతీయ ఖ్యాతి ఉందని.. డి.వి.సుబ్బారావు వంటి న్యాయ కోవిదులు విశాఖవాసులు కావడం అదృష్టంగా అభివర్ణించారు. విశాఖను ప్రముఖ న్యాయవాదులకు పుట్టినిల్లుగా వివరించారు. 1989 నుంచి తనకు విశాఖతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. వందేళ్ల పండగకు తాను వస్తానని చెప్పారు. న్యాయవాదుల సేవలను ప్రస్తుతించారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బేవర సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ నగరం హైకోర్టు బెంచ్‌తో పాటు కేంద్ర ట్రిబ్యునల్ ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలమైనదిగా చెప్పారు. విశాఖకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్‌ను సఫలం చేసే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమాన్ని కార్యదర్శి డి.నరేష్ ప్రారంభించగా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నర్సింగరావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.లక్ష్మణరావు, పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డి.వి.వి.ఎస్.సోమయాజులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు ఏర్పాటు

- నేడు 16 కేంద్రాల్లో పరీక్ష
- హాజరుకానున్న 11,029 మంది..

మహారాణిపేట: గ్రూప్–2 పరీక్షకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 16 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షకు మొత్తం 11,029 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఉదయం 9.45 తర్వాత, మధ్యాహ్నం 2.45 తర్వాత వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో నిర్దేశించిన సమయానికి సిబ్బంది చేరుకోవాలని కోరారు. పరీక్షల నిర్వహణ కోసం కోఆర్డినేషన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ నియమించారు. పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు ఆందోళన చేస్తుండడంతో కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాటు చేశారు.

ఎలక్ట్రానిక్ పరికరాలకు నో అనుమతి

పరీక్షల కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం లేదు. బబ్లింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, కొట్టివేతలకు తావివ్వరాదని, వైటనర్ వినియోగించరాదని అధికారులు సూచించారు. ఇన్విజిలేటర్లు నిబంధనలు పాటించాలని, పరీక్షకు ఐదు నిమిషాల ముందు మాత్రమే సీల్డ్ కవర్లో ఉన్న ప్రశ్నాపత్రాలను ఇవ్వాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్ వీఆర్ఎస్ తుది జాబితా విడుదల

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) జాబితాకు ఆమోద ముద్ర పడింది. దీంతో వీఆర్ఎస్‌పై ఉత్కంఠ తొలగిపోయింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జారీ చేసిన వీఆర్ఎస్ స్కీమ్‌లో భాగంగా ఈ నెల 19న నాన్ వర్క్స్‌కు చెందిన కార్మికులతో పాటు ఈ 4 స్థాయి వరకు అధికారుల జాబితా ప్రకటించారు. అప్పటి నుంచి వర్క్స్, నాన్ వర్క్స్‌లకు చెందిన ఈ 5, పైస్థాయి అధికారుల జాబితా పెండింగ్‌లో ఉంది. దీంతో దరఖాస్తు చేసిన వారు ఆ జాబితా కోసం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు సీఎండీ ఆ ఫైల్‌కు ఆమోదం తెలపడంతో జాబితా విడుదలకు మార్గం సుగమమైంది. ఇదిలా ఉండగా ఇప్పటికే తిరస్కరణకు గురైన వారికి ఈనెల 22 వరకు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించారు.

మత్స్యగుండంలో ఘనంగా శివరాత్రి జాతర

జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ



మత్స్యగుండం జాతర ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ, మఠం సర్పంచ్ శాంతకుమారి,ఉత్సవ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: పవిత్ర పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో శివరాత్రి మూడు రోజుల జాతరను ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్,ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో డాక్టర్ ఎం.జె.అభిషేక్‌గౌడ ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించారు.ఈనెల 25,26,27తేదీల్లో హుకుంపేట మండలం మత్స్యగుండంలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను శనివారం జేసీతో పాటు మఠం సర్పంచ్ మఠం శాంతకుమారి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మినుముల గోపాలపాత్రుడు,పాంగి మత్స్య కొండబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల భక్తుల సహకారంతో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఉచితంగా ప్రసాదం,తాగునీరు అందజేస్తామని, మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు వంతాల ఈశ్వర్,ప్రోటోకాల్ ఇన్‌చార్జి మఠం సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై జోరుగా ప్రచారం



జి.ఎం.కొత్తూరులో ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు



చింతపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

జి.మాడుగుల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులనాయుడుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలో పలు పాఠశాలల్లో శనివారం పీఆర్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ డి.గోపీనాథ్, ఏఎస్సార్ జిల్లా అధ్యక్షుడు యు.వి.గిరి, గౌరవ అధ్యక్షుడు టి.రామస్వామి, నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జి.ఎం.కొత్తూరు , నుర్మతి ,బొయితిలి , జి.మాడుగుల, పెదలోచలిలోని పాఠశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మోహన్‌రావు, కృష్ణమూర్తి, రామయ్య పాల్గొన్నారు.

చింతపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల్లో శనివారం నిర్వహించిన క్యాంపెయిన్‌లో పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీకి మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ ప్రచారం చేశారు. ఉపాధ్యాయులందరూ ఆమెకు మద్దతు తెలపాలని కోరారు. శ్రీ లక్ష్మి, త్రిమూర్తులు రెడ్డి పాల్గొన్నారు.

స్కౌట్‌తో క్రమశిక్షణ.. సేవాభావం

డీఈవో బ్రహ్మాజీరావు



స్కౌట్ ఉద్యమ పితామహుడు పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు,ఇతర ఉపాధ్యాయులు

సాక్షి,పాడేరు: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ,సేవా భావం పెంపొందడానికి స్కౌట్ తోడ్పడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు.ప్రపంచ ఆలోచన దినోత్సవం, స్కౌట్ ఉద్యమ పితామహుడు బాడెన్ పావెల్ జయంతిని తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. బాడెన్ పావెల్ చిత్రపటానికి డీఈవో,స్కౌట్ అధికారులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఈవో మాట్లాడుతూ మన ప్రపంచం–మన భవిష్యత్ నినాదంతో ప్రపంచ ఆలోచన దినోత్సవం 2025 జరుపుకొంటున్నామన్నారు.ప్రపంచ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ప్రపంచ సోదర భావం,ఐక్యతకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తోందన్నారు. విద్యార్థులంతా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల్లో పాల్గొని సమాజానికి సేవ చేయాలన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి బాకా లవకుశ,పాఠశాల హెచ్‌ఎం కంబిడి సుమిత్ర,వ్యాయామ ఉపాధ్యాయులు సింహాచలం,మన్మథరావు,విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్

జిల్లా పంచాయతీ అధికారి లవరాజు

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లో చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి లవరాజు తెలిపారు.పాడేరు పంచాయతీ పరిధిలోని చాకలిపేట నీలకంఠనగర్,హుకుంపేట మండలం గడికించుమండ పంచాయతీ కేంద్రంలో శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటా రెండు డబ్బాల చొప్పున పంపిణీ చేసి తడి,పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ జిల్లాలోని 430 పంచాయతీల పరిధిలో 42,525 గృహాల్లో తడి,పొడి చెత్త సేకరణ చేపట్టామన్నారు. శనివారం ఒక్కరోజే జిల్లాలో 935కిలోల పొడిచెత్త,753కిలోల తడిచెత్త,5952 ప్లాస్టిక్ బాటిళ్లు,912కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించినట్టు చెప్పారు. ఆదివారం కూడా జిల్లాలో తడి,పొడిచెత్తను సేకరిస్తామని,జిల్లాలో ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపీడీవో డేవిడ్‌రాజ్, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి,ఉప సర్పంచ్ బూరెడ్డి రాంనాయుడు,కాడెలి పంచాయతీ కార్యదర్శి ఓలేసు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎటపాకలో ప్రయాణికుల వివరాలు తెలుసుకుంటున్న సీఐ కన్నపరాజు



దుంబ్రిగుడలో వాహనచోదకులతో మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు

ఎటపాక: మండలంలోని గుండాల వద్ద జాతీయ రహదారిపై పోలీసులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ కన్నపరాజు వాహన రికార్డులను పరిశీలించారు. ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రహదారి భద్రతా నియమాలు డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎస్ఐ అప్పలరాజు, సిబ్బంది ఉన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి సమీపంలో శనివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.పాపినాయుడు ద్విచక్ర వాహనాదారులతో మాట్లాడుతూ ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని, లేకుంటే ప్రమాదాలు తప్పవని హెచ్చరించారు. రికార్డులు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు. ప్రస్తుతం హైవే రోడ్డులో వాహనాలు రద్దీ ఎక్కువ ఉండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాహనచోదకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

400 లీటర్ల పులుపు ధ్వంసం

చింతపల్లి: మండలంలో అక్రమంగా సారా తయారీ చేస్తున్న బట్టీలపై దాడిచేసి 400 పులుపును ధ్వంసం చేసి, 5 లీటర్లు సారాని స్వాధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జె.కూర్మారావు తెలిపారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో పలు గ్రామాల్లో సారా బట్టీలపై దాడులు నిర్వహించినట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు గిరిజన గ్రామాల్లో సారా నిర్మూలన దిశగా చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా లౌరింతాడ గ్రామంలో నిల్వ ఉన్న 400 లీటర్లు పులుపును ధ్వంసం చేసి ఐదు లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ కుమార్, కానిస్టేబుళ్లు శివ, నాయుడు, రవితేజ ఉన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా మార్గాల్లో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ–షాలిమర్(08508) స్పెషల్ రైలు ప్రతీ మార్చి 11వ తేదీ నుంచి (ప్రతి మంగళవారం) ఏప్రిల్ 29వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో షాలిమర్–విశాఖ (08507) స్పెషల్ మార్చి 12 నుంచి ఏప్రియల్ 30 వరకు (ప్రతి బుధవారం) నడుస్తాయి. సంబల్‌పూర్–ఈరోడ్ (08311) వీక్లీ స్పెషల్ మార్చి 12 నుంచి (ప్రతి బుధవారం) ఏప్రిల్ 30వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో మార్చి 14 నుంచి మే 2వ తేదీ వరకు (ప్రతి గురువారం) నడుస్తాయి. భువనేశ్వర్–యశ్వంత్‌పూర్(02811) వీక్లీ ఏసీ స్పెషల్ మార్చి 1వ తేదీ నుంచి (ప్రతి శనివారం) ఏప్రిల్ 26 వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో మార్చి 3వ తేదీ నుంచి ఏప్రిల్ 28వ తేదీ (పతి ఆదివారం) వరకు నడుస్తాయి.

ఈపీడీసీఎల్‌తో స్వానిటీ ఒప్పందం



స్వానిటీ సంస్థ ప్రతినిధులతో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్తు సరఫరా, సౌర విద్యుత్‌కు సంబంధించిన అంశాలపై అవసరమైన సాంకేతిక సహకారాన్ని తీసుకునేలా స్వానిటీ ఇనీషియేటివ్‌తో ఏపీఈపీడీసీఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సమక్షంలో సంస్థ ఎనర్జీ కన్సర్వేషన్ విభాగం సీజీఎం జె.శ్రీనివాసరావు సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో స్వానిటీ ఇనీషియేటివ్ సంస్థ ట్రస్టీ ఉమ భట్టాచార్య ఎంఓయూపై శనివారం సంతకాలు చేశారు. ఏపీఈపీడీసీఎల్‌లో అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఫీడర్ స్థాయిలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూటెడ్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఉచితంగా అందించేందుకు అమెరికాకు చెందిన స్వానిటీ ఇనీషియేటివ్ సంస్థ ముందుకొచ్చింది.